క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి, ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

పేదలకు నిత్యావసర సరకుల వితరణ



సరకులు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ విజయ కుమార్, కొటాన రాము

సబ్బవరం: మండలంలోని ఇరువాడలో ఉన్న గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహించే హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిత్యావసర సరకులు వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయ కుమార్‌తో కలిసి మండలంలోని సుమారు 30 మంది నిరుపేదలు, వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు నిత్యావసర సరకుల్ని పంపిణీ చేశారు. వీరికి అల్పాహారంతోపాటు, ప్రయాణ ఖర్చులు అందించారు. హత్తుకునే చేతులు కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 30 మంది అభాగ్యులకు ఈ విధంగా సాయం చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఇస్సాక్, మేథ్యూ, తేజ, షైమీ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ గ్రీవెన్స్‌కు 55 అర్జీలు



టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీకి వినతిపత్రం అందిస్తున్న ప్రజలు

పరవాడ: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ఆయిల్‌ఫెడ్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గండి బాబ్జీ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని, మండలంలోని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఫార్మా పరిశ్రమల పొల్యూషన్, ఉపాధి పనులు, రెవెన్యూ సమస్యలు, పింఛన్ల మంజూరు కోసం ప్రజల నుంచి 55 అర్జీలు వచ్చాయి. ఆయా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, నాయకులు కన్నూరు వెంకటరమణ, సీహెచ్ ముత్యాలు, అట్టా సన్యాసప్పారావు, ఇందల కొండలరావు, బొండా తాతారావు, సన్నిదేముడు, కోమటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ అందరి బాధ్యత



పోలీసు స్టేషన్‌ను ప్రారంభిస్తున్న నగర సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: న్యూపోర్టు పోలీస్ స్టేషన్ భవన మరమ్మతు పనులు పూర్తవడంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం దాన్ని పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోలీస్ స్టేషన్ భవనం వర్షాలకు కారుతూ, కార్యాలయంలో ఉన్న ఫైళ్లు తడిసిపోతున్నాయని తెలుసుకుని పోలీస్ వెల్ఫేర్ సంక్షేమ నిధి నుంచి రూ. 2 లక్షలు కేటాయించి మరమ్మతులు చేయించినట్లు కమిషనర్ తెలిపారు. భవనం ప్రారంభం అనంతరం, పోలీస్ కమిషనర్ సిబ్బందితో సమావేశమయ్యారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. డీసీపీ-2 మేరీ ప్రశాంతి, హార్బర్ ఏసీపీ కాళిదాస్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

పెదగంట్యాడ: డీఎస్సీ పరీక్ష తొలి రోజు శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. వికాస్‌నగర్ జంక్షన్‌లోని ఎస్‌వీఎస్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పరీక్ష నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 300 మందికి గానూ 265 మంది హాజరు కాగా, మధ్యాహ్నం 300 మందికి గానూ 275 మంది హాజరయ్యారు.

పచ్చిరొట్ట సాగు.. భూసారం బాగు

భూసారం ఎంత బాగా ఉంటే.. పంట దిగుబడి అంత బాగుంటుంది. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం విపరీతంగా పెరగడంతో భూసారం క్షీణిస్తోంది. ఆ ప్రభావం పంట దిగుబడిపై పడుతోంది. దీంతో రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట సాగుకు సబ్బవరం మండల రైతులు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా ఖరీఫ్‌కు ముందు పచ్చిరొట్ట సాగును ప్రోత్సహిస్తున్నారు.



గొటివాడ సమీపంలో ఖరీఫ్‌కు వేసవి దుక్కులు చేసుకున్న రైతులు



సబ్బవరంలో రైతులు సాగుచేస్తున్న పచ్చిరొట్ట

- రసాయనికి ఎరువులు, పురుగు మందులతో నేల నిస్సారం
- ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట ఎరువుల సాగుకు నిపుణుల సూచన
- రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి చర్యలు



పచ్చిరొట్ట ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)

సబ్బవరం: ప్రస్తుతం రైతులు సేంద్రియ వ్యవసాయం పద్ధతులపై ఆసక్తి చూపుతున్నారు. విచక్షణారహితంగా వినియోగిస్తున్న రసాయన ఎరువులు, పురుగు మందుల ప్రభావంపై అవగాహన పెంచుకుంటున్నారు. వ్యవసాయ శాఖ రాయితీపై అందించే పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసి, ఏపుగా ఎదిగాక వాటిని నేలలో కలియదున్ని సత్ఫలితాలు పొందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల ఏర్పాటుతో ఇక్కడి వ్యవసాయ సహాయకుల సలహాలు, సూచనలు రైతుల్లో బాగానే ప్రభావం చూపాయి. ఈ ఏడాది కూడా మండల రైతులు ప్రస్తుత తొలకరిని ఆధారంగా చేసుకుని పచ్చిరొట్ట ఎరువుల సాగులో బిజీ అయ్యారు.

పచ్చిరొట్టతో ఉపయోగాలు

- భూమి గుల్లగా మారి నేలలో నీటి నిల్వ/నీరు ఇంకే స్వభావం పెరుగుతుంది.
- పంటకు కావాల్సిన సేంద్రియ పదార్థం అధికంగా భూమిలో చేరి, జీవ రసాయనిక చర్య వల్ల భూసారం పెరుగుతుంది.
- నేలలో పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి
- పాల చవుడును నియంత్రిస్తుంది.
- రసాయనిక ఎరువుల వినియోగం తగ్గడం ద్వారా, పెట్టుబడి వ్యయం తగ్గుతుంది.
- తక్కువ వ్యయంతో ఆరోగ్యవంతమైన పంటల దిగుబడిని సాధించవచ్చు
- జీలుగు, జనుము, పిల్లిపెసర వంటి పైర్లు వేసినప్పుడు వీటి వేర్లు ఎక్కువ లోతుకు వెళ్లడం వల్ల భూమి పొరల్లో ఉండే అనేక పోషకాలు పైకి వచ్చి, ఖరీఫ్ పంటకు తోడవుతాయి.
- పప్పుజాతి పంటల వల్ల రైజోబియం బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని స్వీకరిస్తుంది. భాస్వరం, గంధకం వంటి పోషకాలు గణనీయంగా పెరుగుతాయి.

ఖరీఫ్ సాగుకు 45 రోజులు ముందు

ఖరీఫ్ సాగుకు ముందు పచ్చిరొట్ట ఎరువులుగా జనుము, జీలుగు, పిల్లిపెసర సాగును వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తోంది. రాయితీపై విత్తనాలను అందిస్తోంది. ప్రధాన పంటకు 40 నుంచి 45 రోజుల ముందు వీటిని పొలంలో వేసుకుంటే చాలు. ఖరీఫ్ వరి సాగుకు ముందు దమ్ములో కలియ దున్నడం ద్వారా నత్రజని, భాస్వరం వంటి ధాతువులు పంటకు పుష్కలంగా అందుతాయి. భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి వర్షాభావ పరిస్థితుల్ని సైతం పంట తట్టుకుంటుంది. పచ్చిరొట్టను భూమిలో కలియదున్నడం ద్వారా నేలకు మేలు చేసే మిత్రజాతి పురుగులు వృద్ధి చెందుతాయి. తద్వారా పంటకు హాని చేసే చీడ పీడల ఉధృతి తగ్గి, తెగుళ్ల నియంత్రణ సాధ్యపడుతుంది.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

సబ్బవరంలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 3,395 ఎకరాలు కాగా అందుకు అనుగుణంగా రైతులు పచ్చిరొట్ట ఎరువులు వేసుకునేందుకు విత్తనాలను వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు. 50 శాతం రాయితీపై ఈ విత్తనాలను పంపిణీ చేయనున్నారు. అందుకోసం జీలుగ 4 క్వింటాళ్లు, జనుము 11 క్వింటాళ్లు, పిల్లిపెసర 6 క్వింటాళ్లు సిద్ధం చేశారు. మిక్స్‌డ్ విత్తనాలు ఒక క్వింటా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

రాయితీ విత్తనాలు, ధరలు

విత్తనం రకం	ఎకరాకు విత్తనాలు	కిలోధర (రూ.ల్లో)
జనుము	8-10 కిలోలు	54.50
జీలుగ	12-14 కిలోలు	61.50
పిల్లిపెసర	6-8 కిలోలు	90.00

సేంద్రియ సాగువైపు రైతుల మొగ్గు



ప్రస్తుతం రైతులు గతంలో కంటే సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధాన పంటకు ముందు పచ్చిరొట్ట విత్తనాలు వేసి, 40 రోజుల తర్వాత ఏపుగా ఎదిగిన ఆ పంటను నేలలో కలియదున్నడం ద్వారా భూమి సారవంతంగా మారుతుంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చు. నేలల ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు రాబోయే తరాలకు మంచి సారవంతమైన భూముల్ని, ఆరోగ్యవంతమైన దిగుబడులను అందించవచ్చు.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం

సరిపల్లి చెరువులో నిర్మాణాలకు హైకోర్టు అడ్డుకట్ట



హైకోర్టు ఉత్తర్వుల బోర్డు ఏర్పాటు చేస్తున్న ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, సర్పంచ్ రామకృష్ణ

పెందుర్తి: సరిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఎరీనా వాటర్ పార్కుకు రోడ్డు కోసం చెరువును ఆక్రమించినట్లు హైకోర్టు నిర్ధారించింది. సర్వే నెం.263లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని డబ్ల్యూపీ నెం .12670/2025, ఐఏ 1/2025 ద్వారా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయా ఉత్తర్వుల ఆధారంగా సరిపల్లి ఎంపీటీసీ సభ్యుడు గొల్లవిల్లి రమణ, సర్పంచ్ గొర్లె రామకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు రమణ మాట్లాడుతూ వాటర్ పార్కు రోడ్డు కోసం గ్రామానికి చెందిన చెరువును ఆక్రమించడంపై న్యాయ పోరాటం చేసి విజయం సాధించామన్నారు. ఇక్కడ రోడ్డు నిర్మిస్తే సరిపల్లి మనుగడకే ప్రమాదమన్నారు. ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు అడ్వకేట్ కమిషనర్ ఉదయ్ కుమార్ సోమవారం ఇక్కడ పర్యటించి హైకోర్టుకు నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. ఆ నివేదిక ఆధారంగానే కోర్టు తాజా ఉత్తర్వులు జారీ చేసింది.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



వరప్రసాద్

పెందుర్తి: స్థానిక సాయినిరంజన్ కాలనీకి చెందిన కరికూరి వరప్రసాద్(30) అదృశ్యంపై కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వరప్రసాద్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 31న రాత్రి 10.30కు పని మీద బయటకు వెళ్తున్నట్లు చెప్పి స్కూటీపై బయల్దేరాడు. ఇన్ని రోజులైనా ఇంటికి రాలేదు. ఫోన్ కూడా స్విచాఫ్ కావడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గురువారం పోలీసులను ఆశ్రయించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీ బి.అప్పారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి



సంపద తయారీ కేంద్రం వద్ద స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్

పరవాడ: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా వాడచీపురుపల్లి, వెన్నలపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఫైనాన్స్ మేనేజర్ విజయశేఖర్ శుక్రవారం తనిఖీ చేశారు. వీటి కార్యకలాపాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సంపద తయారీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. వ్యర్థాలను విలువైన వస్తువులుగా మార్చే చర్యలకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. సందర్శనలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం సంపద తయారీ కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్, ఈవోఆర్డీ వి.ధర్మారావు, వెలుగు ఏపీఎం రంగారావు, వాడచీపురుపల్లి, వెన్నలపాలెం పంచాయతీ కార్యదర్శులు అచ్యుతరావు, భారతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంతాన గోపాలకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట



పూజలందుకుంటున్న సంతాన గోపాలకృష్ణ సహిత స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరుడు

సబ్బవరం: మండలంలోని అయ్యన్నపాలెం శివారు దుడ్డువాక గ్రామంలో శ్రీసంతాన గోపాలకృష్ణ సహిత స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు స్వామిని దర్శించుకుని, పూజలు జరిపారు. స్థానిక సర్పంచ్ బుదిరెడ్ల లక్ష్మి, ఉప సర్పంచ్ కనకరాజు, గ్రామ పెద్దలు దొగ్గ చంద్రశేఖర్‌నాయుడు, బైలపూడి హరగోపాల్, దొగ్గ దేముడు, ఇందల రమణ, బలిరెడ్డి అప్పారావు, గండి దుర్గాప్రసాద్, దేముడుబాబు, కంచిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్

సబ్బవరం: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్‌ఎన్‌ఎల్‌యూ)లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం–6 శుక్రవారం ప్రారంభమయింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ మాట్లాడుతూ క్రమశిక్షణ, బోధనాంశాలపై అవగాహనతో భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. 10 రోజులపాటు నిర్వహించే ఈ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, టెంట్ ఫిక్సింగ్, ఫిజికల్ ట్రైనింగ్, యోగా, ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యక్తిత్వ వికాసం, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. శిబిరంలో 13వ ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన వివిధ కళాశాలలు, స్కూళ్ల నుంచి 468 మంది క్యాడెట్స్ పాల్గొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మడాసు మాట్లాడుతూ ప్రతి క్యాడెట్ ఈ శిబిరాన్ని వినియోగించుకుని డిఫెన్స్‌లో చేరి, ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. శిబిరంలో సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, 12 మంది ఎన్‌సీసీ అధికారులు, 16 మంది వరకూ పీఐ స్టాఫ్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు



పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

పెందుర్తి: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. గత 40 రోజులుగా ఈ శిబిరంలో కథలు చదవడం, రాయడం, చెప్పడంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు సభలో ప్రశంసా పత్రాలు అందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్, పెందుర్తి గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, డీఆర్‌సీ చారిటబుల్ ట్రస్ట్ అధినేత దాడి రమణచిట్టి, గౌరీ సేవా సంఘం మాజీ అధ్యక్షుడు ఆళ్ల సత్యనారాయణ, సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్, స్థానిక పెద్దలు సూరిఅప్పారావు, శరగడం రమణ, పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ, కృష్ణప్రియ, లక్ష్మీతేజ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో విజేతలు

సబ్బవరం: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, విజ్ఞాన భాండాగారాలని ఎంపీడీవో బి.పద్మజ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 40 రోజులుగా కొనసాగిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఎంపీడీవో పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులంతా తమకు అందుబాటులో ఉండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాల్లో పుస్తక పఠనం దినచర్యగా మార్చుకోవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెద్దం ప్రసాదరావు, మండల విద్యాశాఖాధికారి రవీంద్రబాబు, గ్రంథాలయ అధికారి వి.శిరీషతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో మజ్జిగ చలివేంద్రం



మజ్జిగ ప్యాకెట్‌లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

పెందుర్తి: ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా 100 మందికి మజ్జిగ ప్యాకెట్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి కార్యాలయానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకంగా మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నాలజీని మెరుగుపర్చుకుంటూ ఉన్నత స్థాయికి..


పర్యావరణ దినోత్సవంలో ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ



ఫార్మాసిటీ సీఈటీపీలో మొక్క నాటి, మాట్లాడుతున్న ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో కామన్ ఎఫ్లూయట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(సీఈటీపీ)లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్లాంట్‌లో ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఫార్మా ఉద్యోగులు ప్లాంటు ఆవరణలో వెయ్యి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణ మాట్లాడుతూ కాలానుగుణంగా టెక్నాలజీని మార్చుకుంటూ ఫార్మాసిటీని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి ఫార్మాసిటీ మోడల్ విధానాన్ని తెలుసుకునేందుకు వస్తున్నారని పేర్కొన్నారు చెప్పారు. ఉద్యోగులు పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఇటీవల వివిధ పాఠశాలలో రాంకీ ఫౌండేషన్ నిర్వహించిన చిత్రలేఖనం పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్ బక్షి, రాంకీ ప్రతినిధులు ఎర్రయ్య, రాఘవరెడ్డి, చంద్రశేఖర్, మాధవ్, మోహన్, జోష్, నరేంద్ర, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ కళాశాలలో పాముల సంచారం



పెందుర్తి ప్రభుత్వ కళాశాల భవనంలో సంచరిస్తున్న భారీ సర్పం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు తరగతి గదుల భవనంలో ప్రమాదకర విష సర్పాలు సంచరిస్తూ ఆందోళన కలిగిస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం స్థానికులు ఓ పామును గుర్తించారు. స్నేక్ క్యాచర్‌లకు సమాచారమిచ్చారు. అయితే వారు అందుబాటులో లేరు. కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో విష సర్పాల సంచారంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలలో తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్ర చర్యలు



కార్డన్ సెర్చ్‌లో భాగంగా స్థానికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్, సిబ్బంది

పెందుర్తి: నేర ప్రవృత్తి కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట గంగిరెడ్ల కాలనీ, ఎరుకుల కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం వేకువజాము 5.30 నుంచి ఉదయం 7 వరకు 20 మంది బృందంతో సీఐ నేతృత్వంలో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని 12 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల గురించి ఆరా తీయాలని సూచించారు. అలాంటి వ్యక్తుల వాహనాలను, ఇతర సమాచారం తెలిసిన వెంటనే సమీపంలోని పోలీసులకు తెలియజేయాల్సిందిగా కోరారు. గోప్యత పాటిస్తామన్నారు. చోరీల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడే అంశంలో ప్రజల సహకారమే కీలకమని సూచించారు. రానున్న రోజుల్లో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎస్‌ఐ దేముడునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించాలి



అగ్నిప్రమాదాలపై డెమోలో అగ్నిమాపక సిబ్బంది, ఎంఈవో రవీంద్రబాబు

సబ్బవరం: విద్యార్థులకు అవసరమైన సంపూర్ణ పౌష్టికాహారం అందించేందుకు మధ్యాహ్న భోజన(ఎండీఎం) నిర్వాహకులు కృషి చేయాలని ఎంఈవో రవీంద్రబాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎండీఎం నిర్వాహకులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వంటలను సిద్ధం చేసేటప్పుడు కూరగాయలు కోయడం, పొయ్యిల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సబ్బవరం అగ్నిమాపక అధికారి సత్యరాజ్ గ్యాస్, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సమయంలో చేపట్టాల్సిన చర్యలను డెమో రూపంలో వివరించారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ మహేష్, వీఆర్పీలు భూలక్ష్మి, కళాభారతి, రమణ, గౌరి పాల్గొన్నారు.